క్లుప్తంగా

సింఘ్వీ నామినేషన్‌లో ప్రభుత్వవిప్



వేములవాడ: రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ సోమవారం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ముస్తాబాద్ బంద్

ముస్తాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా అఖిల పక్షం ఆధ్వర్యంలో మంగళవారం బంద్‌కు పిలుపునిస్తున్నట్లు అఖిల పక్షం నాయకులు మెరుగు అంజాగౌడ్, ఎద్దండి నర్సింహారెడ్డి, గజ్జెల రాజు తెలిపారు. బంద్‌కు అన్నివర్గాల వారు సహకరించాలని కోరారు. దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంకులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల తిప్పలు



బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలో ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాఖీ పండుగ, సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, పట్టణంలోని ప్రధాన రోడ్డుగుండా వెళ్లే బ్రిడ్జి వద్ద వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రతి సోమవారం, పండుగ రోజుల్లో వాహనాల ట్రాఫిక్ వల్ల బ్రిడ్జిపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందుల తొలగించాలని, రెండు బ్రిడ్జిలు మంజూరు చేసినప్పటికీ ఒక్క బ్రిడ్జి మాత్రమే పూర్తి కావడంతో మరో బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేములవాడ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



వేములవాడరూరల్: రాఖీ పండుగ సందర్భంగా వేములవాడ బస్టాండ్‌లో సోమవారం ప్రయాణికుల రద్దీ కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆర్టీసీ యాజమాన్యం గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

ఇల్లంతకుంట: శ్రావణ సోమవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల భక్తులు జంగారెడ్డిపల్లె గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలో ఇదే పెద్ద ఆలయం. ఇల్లంతకుంట, వంతడుపుల, ముస్కాన్‌పేట, రహీంఖాన్‌పేట, అనంతారం, తదితర గ్రామాల భక్తులు ఉపవాస దీక్షలు ఉండి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అన్నపూజలు, అభిషేకాలు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



వీర్నపల్లి: మండల కేంద్రం నుంచి మద్దిమల్ల గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఎండిన భారీవృక్షం ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. దీంతో ఎండిన వృక్షం ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న వృక్షాన్ని ప్రమాదం జరగకముందే తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



వేములవాడ రూరల్ : రూరల్ సీఐ శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న విద్యార్థిని



ఎల్లారెడ్డిపేట: వృద్ధాశ్రమంలో రాఖీ కడుతున్న మహిళ

ఘనంగా రక్షాబంధన్

సోదరసోదరీమణుల అనురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా సోదరులు తమకు తోచిన కట్నకానుకలను అందజేశారు. తోబుట్టువులకు రక్షాబంధన్ ఆత్మీయ చిహ్నంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. వేములవాడ, ఎల్లారెడ్డిపేటలో తమ పెంపుడు శునకాలకు ఇంటి యజమానులు రాఖీలు కట్టారు. – సాక్షి నెట్‌వర్క్



వీర్నపల్లి: తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి



తంగళ్లపల్లి: మండెపల్లి వృద్ధాశ్రమంలో..



బోయినపల్లిలో ఆర్మీ జవాన్ మహేందర్‌కు రాఖీ కడుతున్న సోదరి



వేములవాడ: సోదరుడికి రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి



సిరిసిల్లలో తమ్ముడికి రాఖీ కడుతున్న చిన్నారి



ఎల్లారెడ్డిపేట : గొల్లపల్లిలో శునకానికి రాఖీ కడుతున్న ఇంటి యజమానులు



వేములవాడలో అక్కాచెల్లెళ్లు



ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

వేములవాడ/ముస్తాబాద్/చందుర్తి/ఎల్లారెడ్డిపేట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముస్తాబాద్: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని మాజీ జెడ్పీటీసీ మేరుగు యాదగిరిగౌడ్ అన్నారు. మోహినికుంటలో రైతు రుణమాఫీపై రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. సీఎంకు రైతులు రుణపడి ఉంటారన్నారు. కాంగ్రెస్ నాయకుడు సతీశ్, రైతులు పాల్గొన్నారు.

వారసంత.. సమస్యల చింత

- రోడ్లపైనే నిర్వహణ
- కాగితాలకే ప్రతిపాదనలు పరిమితం
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ఎల్లారెడ్డిపేటలో రోడ్డుపైనే నిర్వహిస్తున్న వారసంత

ఎల్లారెడ్డిపేట: ఎన్నో ఏళ్లుగా ప్రధాన రోడ్లపైనే వారసంతలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక స్థలాలను సమకూర్చుతామని అధికారులు, పాలకవర్గాలు చేస్తున్న తీర్మానాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. సంత జరిగేరోజు ఇరుకైన రోడ్డువెంట వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం, రాచర్ల గొల్లపల్లిలో శనివారం జరిగే రెండు సంతలు రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో సంత జరిగే రోజు మొదటి బైపాస్ గుండా ప్రయాణికులను దారి మళ్లిస్తున్నారు. మొదటి బైపాస్ గుండా వెళ్తున్న క్రమంలో వాహనాలు ఢీకొని కాలనీవాసులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రతి వారసంత రోజు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ వ్యాపారులు, ఇటు వినియోగదారులకు కష్టాలు తప్పడం లేదు.


స్థలాల ఎంపికలో జాప్యం..

ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీతో పాటు రాచర్ల గొల్లపల్లిలో వార సంతలకు ప్రత్యేక స్థలాలు ఎంపికచేయడంలో అధికారులు, పాలకవర్గాలు విఫలమవుతున్నాయి. గ్రామసభల్లో ప్రజలు సంతలకు వెంటనే ప్రత్యేక స్థలాలు గుర్తించి అక్కడే నిర్వహించాలని కోరుతున్నా పట్టించుకునేవారు లేరు. ఎల్లారెడ్డిపేటలోని గిద్దె చెరువు ప్రాంతంలో సంతను నిర్వహించాలని ప్రతిపాదనలు చేసినా అది కాగితాలకే పరిమితమైంది. గొల్లపల్లి గ్రామ శివారులో సంతకు అనువైన స్థలం లేకపోవడంతో జాప్యం జరుగుతున్నట్లు ప్రత్యేకాధికారులు తెలుపుతున్నారు.

సంతకు వచ్చే గ్రామాల ప్రజలు


ఎల్లారెడ్డిపేట సంతకు సమీప దుమాల, పదిర, నారాయణపూర్, కిషన్‌దాస్‌పేట, సింగారం, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్, పదిర, హరిదాస్‌నగర్ గ్రామాలకు చెందిన ప్రజలు, రాచర్లగొల్లపల్లి సంతకు రాచర్ల బొప్పాపూర్, గుండారం, రాజన్నపేట, తిమ్మాపూర్, కిష్టునాయక్ తండా, దేవునిగుట్ట తండా, బాకూర్‌పల్లి తండా, పోచమ్మ తండా తదితర గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రతివారం ప్రజలు వస్తుంటారు. వెంటనే ప్రత్యేక స్థలాలు గుర్తించి అక్కడే వారసంతలు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏళ్లుగా రోడ్లపైనే




కొన్నేళ్లుగా రోడ్లపైనే సంత నిర్వహిస్తున్నారు. ఇరుకైన రోడ్ల మధ్య సంత నిర్వహించడంతో కూరగాయలు కొనడం ఇబ్బందిగా ఉంది. రోడ్లపై ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, పాలవర్గసభ్యులు చర్యలు తీసుకొని సంతను మరోచోటుకు మార్చాలి. – అంతేర్పుల లక్ష్మి, ఎల్లారెడ్డిపేట

నిత్యం ప్రమాదాలు



రోడ్లపై నిర్వహించే వార సంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంతరోజు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. కొత్త వాహనదారులు దారి మళ్లింపుతో ఇబ్బంది పడుతున్నారు. సంతలో నీడ లేకపోవడంతో వ్యాపారులు, సంతకు వచ్చేవారు తడుస్తున్నారు. – జేరిపోతుల నాగరాజు, ఎల్లారెడ్డిపేట

స్థలాలను ఎంపిక చేస్తాం



ఎల్లారెడ్డిపేట, గొల్లపలి వారసంతలకు ప్రత్యేక స్థలాలు ఎంపిక చేస్తాం. గిద్దె చెరువులో స్థలాన్ని ఎంపికచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రాచర్ల గొల్లపల్లిలో అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నాం. ఎంపిక ప్రక్రియను పూర్తిచేసి త్వరలోనే సంతలను మారుస్తాం. – సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



బోయినపల్లి: మండలకేంద్రం నుంచి వేములవాడ వెళ్లే రోడ్డులో పోస్ట్ ఆఫీస్ పరిసరాల్లోని మూలమలుపు వద్ద వర్షం పడిన ప్రతిసారి ఈ గుంతలో నీరు నిలుస్తోంది. పెద్ద వాహనాలు వేగంతో వెళ్లినపుడు బురదనీరు పాదచారులపై పడుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు సమస్యను పరిష్కరించాలి. – బోయినిరాజు, బోయినపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
విష్ణువర్ధన్, పీఆర్, ఏఈ, బోయినపల్లి, 9493884010

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346626

అధికారుల తప్పిదంతోనే రుణమాఫీలో ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట: మండలం పరిధిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారుల తప్పిదం వల్లే కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పరిధిలోని ఐఓబీ బ్యాంకులో ఐఎఫ్‌సీ కోడ్‌లో తప్పుల మూలంగా ఈ ఇబ్బంది జరిగిందన్నారు. ఎల్లారెడ్డిపేట పరిధిలో రెండో విడతలో 62 మంది రైతులకు రుణమాఫీ కాగా, మూడో జాబితాలో కేవలం 16 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. స్థానిక ఐఓబీలో సుమారు వెయ్యిమంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. ఈనెల చివరివరకు తప్పులను సరిచేసి రైతులకు రుణమాఫీ డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

డీజే నిర్వాహకులపై కేసు

తంగళ్లపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో పెద్ద శబ్దాలతో డీజేలు పెట్టిన నేరెళ్లకు చెందిన పొలాడి నవీన్, తంగళ్లపల్లికి చెందిన కోడం పృథ్వీ, పంది సాయికుమార్, కోడం ప్రశాంత్‌పై సోమవారం కేసునమోదు చేసి డీజేలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకండా డీజేలు పెడితే చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా 'సోమ వారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	12	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	01	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	02	1,008
నందీశ్వర్ నాన్‌ఏసీ	09	560
నందీశ్వర సూట్స్	01	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	08	448
పార్వతీపురం స్పెషల్	07	672
పార్వతీపురం సాధారణ	14	336

– వేములవాడ

ఘనంగా నూలు పౌర్ణమి



తంగళ్లపల్లి: పద్మనగర్‌లో జంధ్యాలతో పద్మశాలీలు



ఎల్లారెడ్డిపేటలో శివపార్వతుల శోభాయాత్ర



కోనరావుపేట: నిమ్మపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న పద్మశాలీలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో సోమవారం నూలు పౌర్ణమి సందర్భంగా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శివ పార్వతుల శోభాయాత్రను నిర్వహించారు. స్థానిక మార్కండేయ ఆలయం నుంచి రథంపై స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం అధ్యక్షుడు రాపెల్లి దేవాంతం, కార్యదర్శి వనం రమేశ్, సభ్యులు పోతు ఆంజనేయులు, గాజుల దేవదాసు, గోశిక దేవదాసు, రాపెల్లి అంబదాస్, గౌరీ శంకర్, సుంకి భాస్కర్, దోమల భాస్కర్, సుంకి విష్ణు, మనోహర్, శ్రీకాంత్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్‌లో నూలు పౌర్ణమిని పద్మశాలీ కుల బాంధవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పద్మశాలీలు ప్రత్యేకపూజలు చేసి జంధ్యాలను ధరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మోర శ్రీకాంత్, నర్సప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలో నూలు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, హోమం చేశారు. ఆలయంలో పూజల అనంతరం జంధ్యాలు ధరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు తడుక బాలకిషన్, మార్కండేయ సేవా సమితి అధ్యక్షుడు గూడూరి రాజమల్లయ్య, ధర్మయ్య, రాజు, మల్లేశం, రమేశ్, దేవానందం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి, కోనరావుపేట గ్రామాల్లో మార్కండేయ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. నూలుపౌర్ణమి సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కండేయుడి చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చౌటపెల్లి వెంకటేశం, నిమ్మపల్లి పద్మశాలీ సంఘం పెద్దలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

రుద్రంగి: సోమవారం నూలు పౌర్ణమి సందర్భంగా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. శివ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజ స్తంభ పతాకావరోహణ చేశారు. మగ్గంపై వస్త్రం నేస్తూ, దేవతామూర్తుల వేషధారణలతో భజనలు చేస్తూ శోభయాత్ర నిర్వహించారు. పద్మశాలీ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సిద్దార్థ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.